♦ మనది లోకవిద్య ఆధారిత సమాజం యొక్క జ్ఞానాన్ని గుర్తించమని ఆందోళన

♦ రైతుల, చేతివృత్తిదారులు, ఆదివాసీ, చిన్నపరిశ్రమ, చిల్లరవర్తకులు, మహిళలకు గల సహజ జ్ఞానమే లోకవిద్య. వీరందరి జ్ఞాన ఆధార నిర్మితమే లోకవిద్య సమాజం.

♦ ప్రతి మానవుడికి తన జ్ఞానం ఆధారంగా ఏదో ఒక ఉద్యోగం కల్పించి అందరికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన వేతనం, వేతన సంఘ సిఫారస్సుల మేరకు చెల్లించాలి.

♦ వృత్తి విద్యాధరులందరికి ముడిసరుకు, విద్యుత్ సరసమైన ధరలకు ఇచ్చి వారి ఉత్పత్తులకు గిట్టుబాటు రేటు చెల్లించడం ద్వారానే ప్రభుత్వ ఉద్యోగులతో సమాన వేతనం సాధ్యం.

♦ వ్యవస్థీకృత ఉద్యోగులతో సమానంగా అన్ని రంగాల వారికి సమాన వేతనం చెల్లించాలి.

♦ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వృత్తి విద్యాధరులకు, రైతులకు ఖచ్చితమైన సమసంపాదన కల్పించాలి.

**లోకవిద్య ప్రపంచం ప్రచురణలు - 1**

**కాపీలు - 2000, వెల-రూ. 10/-**

ప్రతులకు : 10-100, న్యూ గడ్డిఅన్నారం, సరూర్‌నగర్, పి&టి కాలనీ, హైదరాబాద్-500 060

# అందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానముగా ఖచ్చితమైన వేతనం ఉండాలి - ఉద్యోగ ఉపాధి కల్పించాలి

రచన : సునీల్‌సహస్రబుద్దే

అనువాదం : యం. సత్యమ్మ, విశ్రాంత ఉపాధ్యాయురాలు

**లోకవిద్య జనాందోళన**

10-100, న్యూ గడ్డిఅన్నారం, సరూర్‌నగర్, హైదరాబాద్-500 060

# అందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానముగా ఖచ్చితమైన వేతనం ఉండాలి - ఉద్యోగ ఉపాధి కల్పించాలి

**దేశాభివృద్ధికీ, ప్రజలందరి సౌభాగ్యానికీ మార్గం :**

దేశాన్ని అభివృద్ధి మార్గంలో తీసుకుపోవడానికి రెండు సూచనలపై ప్రజలకు నైతికంగా ధర్మబద్ధంగా జీవించటానికీ ఈ క్రింది కార్యాచరణ తప్పనిసరి.

అ. ప్రతి పురుషుడు మరియు స్త్రీకి ఖచ్చితమైన, వారి సామర్థ్యాన్ని ఉపయోగించుకుని ఖచ్చితమైన ఉద్యోగ ఉపాధి కల్పించి సరైన సంపాదన చెల్లించాలి.

ఆ. ప్రతి వ్యక్తి జ్ఞానానికి, నైపుణ్యానికి తగిన విలువ లభించాలి. పాఠశాల మరియు కాలేజికి సంబంధించిన విద్యావిషయములలో ఎటువంటి భేధ భావము ఉండరాదు.

1. దేశంలో ప్రతి పౌరుడికి ఏదో ఒక పనిలో నేర్పు ఉంటుంది. అది చూచి నేర్చుకోవటం వల్ల కావచ్చు. తల్లిదండ్రులతో కలిసి పనిచేసి నేర్చుకోవటం ద్వారా కావచ్చు. విద్యా బోధనవల్ల కావచ్చు చివరగా గ్రహణ శక్తివల్ల కావచ్చు. కానీ అందరికి జ్ఞానం ఉందని, ఆ జ్ఞానం ద్వారా సమాజానికి వస్తు ఉత్పత్తి చేయడంలోను, విలువలను జత చేయడంలోను, సేవలుచేయడంలోను కావచ్చు. అందుచేత అందరి జ్ఞానాన్ని సమాజం ఉపయోగించుకొని అందరికి కచ్చితమైన న్యాయపరమైన సంపాదన కల్పించాలి. అది ఎంత ఉండాలంటే ప్రభుత్వ ఉద్యోగుల, కార్మికుల వేతన సంఘాలు నిర్ధారించినంత. దీనివలన ప్రజలందరికి పని లభించటమే కాక వస్తూత్పత్తి, సేవల ఉత్పత్తి ద్వారా, దేశ సంపద పెరుగుతుంది. ప్రజలమధ్య సమానతకుదారి తీస్తుంది.

2. రైతుకు వ్యవసాయము చేయడం తెలుసు, చిన్న దుకాణముల (కుటీరపరిశ్రమలు) వారికి వారి వ్యాపారమే తెలుసు, ఆదిమవాసులకు అడవికి సంబంధించిన జ్ఞానం ఉంటుంది. చిరు వ్యాపారులకు వారి వ్యాపారంలో ఎంత పెట్టుబడిపెట్టాలో తెలుసు, వీరికున్నటువంటి తెలివిని సమాజం గుర్తించడం లేదు. ప్రభుత్వము దృష్టిలో చదువుకున్న వారే మంచి జ్ఞానులని భావిస్తోంది. ప్రభుత్వము వారి సంపాదనపైనే దృష్టి సారిస్తోంది. పాఠశాల, కాలేజీకి వెళ్ళనివారికి జ్ఞానం లేదని వారు అజ్ఞానులని, వారు సంపాదించటానికి అర్హులుకారని, నాగరికులు కారని నేటి సమాజం భావిస్తోంది. దీన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉంది. దీనికి మానసిక పరివర్తన అవసరం.

3. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ వర్గాల వారికి సమానమైన సంపాదన అవకాశాలు ఇవ్వడానికి రెండు రకముల కొలమానమును అనుసరిస్తున్నాయి. నిరుద్యోగులను లెక్కపెట్టడానికి, కేవలం చదువుకొన్న వారినే లెక్కలోకి తీసుకొని వారిలో కొందరికే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. కాని పొలంలో పనిచేసే రైతులు, కుటీర పరిశ్రమలు చేసేవారి గురించి, అడవులలో నివసించే ఆదిమవాసుల గురించి, రైలు పట్టాలపై పనిచేసే కూలీల గురించి, రైలుగేటు దగ్గర పని చేసే వారి గురించి, రోజువారి నిత్యావసర వస్తువులు అమ్ముకొనే వారి గురించి, మేస్త్రీలు, హమాలీలు, కూలీలు ఈ పనులన్నింటిలో భాగస్తులయిన, కుటుంబపోషణ చేసేవారి గురించి, వారి యొక్క సంపాదన గురించి ప్రభుత్వాలు ఏమాత్రము బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదు.

4. ప్రభుత్వము రెండు రకముల కొలమానాలతో శిక్షణలో సైతం బేధము చూపిస్తోంది. ఎవరైతే పాఠశాల కాలేజిలో విద్యను అభ్యసిస్తారో, వారికి మాత్రమే మంచి శిక్షణను, ఎక్కువ డబ్బును ఖర్చు చేస్తోంది. వారే సంపాదనకు అర్హులు అని భావిస్తున్నారు. రెండవ రకం ప్రజలు, వారి స్వశక్తితోనే కష్టపడి జ్ఞానం సంపాదిస్తారో, వారికి ప్రభుత్వము ఎలాంటి సహాయం చెయ్యడం లేదు. న్యాయపరమైన సంపాదన కేవలం విద్యనభ్యసించిన వారికే అనడం గీటురాయిలాంటి అబద్ధము. ఇది పక్షపాత వైఖరి చూపడం తప్ప సరియైన న్యాయం కాదు.

5. దేశములో స్వశక్తితో సంపాదిస్తున్నదానికి, మరియు విద్యా బలముతో సంపాదిస్తున్న వారికి జ్ఞానంలో పెద్దగా వ్యత్యాసం లేదు. అయినా మన ప్రభుత్వాలు వ్యవసాయ విశ్వవిద్యాలయములో ప్రొఫెసర్లు, చేనేత మరియు టెక్స్టైల్ మిల్లులో ఇంజనీర్లు, మత్స్యశాఖ ఉద్యోగస్తులు, జలమండలి ఉద్యోగస్తులు, అడవిలో పనిచేసే అధికారులు, ఆరోగ్యశాఖలో పనిచేసే కాంపౌండర్లు, విద్యుత్ శాఖ మరియు పి.డబ్ల్యు.డి. శాఖలో చేసే ఉద్యోగస్తులకు నెలవారి వేతనాలు ఇచ్చే ప్రభుత్వం స్వశక్తితో దుకాణంలో సరుకులు అమ్ముకొనే వారి సంపాదనలో ఇంత బేధము ఎందుకు చూపిస్తోంది? ఈ అన్ని రకాల జ్ఞానం కలవారు దేశం మరియు సమాజానికి అవసరమే. ఇలాంటి జ్ఞానం ఉన్నవారికి సరియైన సంపాదన లభించాలి. రైతులు, వ్యాపారస్తులు, ఆదివాసులు, మహిళలు, కూలిపనిచేసే వారు, చిన్న చిన్న దుకాణదారులు, స్వయంఉపాధి కల్పించుకొనే వృత్తికారులు మరియు యువకులు వారు ఏ పని చేయగలుగుతారో, దానిని బట్టి వారికందరికి ఖచ్చితమైన సంపాదన లభించాల్సిన అవసరం ఉద్రిక్తతలు లేని సమాజ నిర్మాణానికి అత్యవసరం. దేశాభివృద్ధికి అవసరం.

6. ఎవరికైతే కూలీ లభించదో, అలాంటి వారికి ఏదో ఒకదాంట్లో జ్ఞానం తప్పకుండా ఉండి ఉంటుంది. వారికి ఏదైనా పని తప్పకుండా వస్తుంది. ఎవరైతే దినసరి కూలీలుంటారో, వారు రైతులు కాని లేక చిన్న వ్యాపారస్తులు లేదా దుకాణదారులు,

వారికి ఏదో ఒక దాంట్లో నైపుణ్యము ఉంటుంది. కాని వారియొక్క జ్ఞానాన్ని గుర్తించక ప్రభుత్వం వారి యొక్క కూలీని చాలా తక్కువగా ఇవ్వాలని నిర్ణయిస్తోంది. ప్రభుత్వము వారిని అజ్ఞానులుగా గుర్తిస్తోంది. ఇది వారి జ్ఞానానికి అవమానమే కాక సమాజంలో తీవ్ర అసమానతలకు దారితీస్తోంది. ఉద్రిక్తలను ప్రోత్సహిస్తోంది.

7. ప్రభుత్వ ఉద్యోగుల గురించి ప్రభుత్వం పి.ఆర్.సి. ప్రకారము వేతనాలు పెంచుతూ ఉంటుంది. కాని స్వశక్తి, వారికున్న జ్ఞానము ప్రకారము జీవిస్తున్న వారి సంపాదన గురించి ఎలాంటి సహాయము చేయడం లేదు. కావున వీరి మధ్యన భేదం పెరుగుతూనే ఉంది. సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతూనే ఉన్నాయి.

   ప్రభుత్వ ఉద్యోగులకు ప్రస్తుతము సుమారు ఒకరి జీతము నెలకు రూ. 20,000 ఉంటుంది. కాని ఒక సామాన్య వ్యాపారస్తుడు లేక రైతు యొక్క ఆదాయము నెలకు కేవలము ఐదు లేక ఆరువేలు మాత్రమే. ఆ ఆదాయము ప్రతినెల ఉండదు. ఇది ప్రభుత్వము యొక్క (హెచ్చు, తగ్గుల) అవినీతికి నిదర్శనము. ఈ రోజులలో ఎవరిదైనా కానివ్వండి ప్రతి ఒక్కరి సంపాదన ప్రతిరోజు వెయ్యి రూపాయలు ఉండాల్సిన అవసరం ఉంది.

8. గడచిన 100 సంవత్సరముల నుండి పరిపాలనలు మారడం రాజకీయ వ్యవస్థలో మార్పులు రావడం, ఎన్నో వాగ్దానాలు చేయడం జరుగుతున్నాయి. దున్నేవారికే భూమి, కూలీపనికి కనీస వేతనం, చిన్న పరిశ్రమలు చేసేవారికి అంగడి, వ్యవసాయ ఉత్పత్తులకు తగిన ఆదాయం మరియు దళితులు, ఆదివాసులు మరియు వెనుకబడిన వర్గాల రక్షణ నినాదాలు మిన్నంటుతున్నాయి. నిజంగా ఆర్థికపరంగా ఈ యుగంలో అన్ని వర్గాల పేద ప్రజలకు, ప్రతి కుటుంబములో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము కల్పించారా!

9. అందువలన ప్రతి గ్రామములో, ప్రతి చిన్న చిన్న బస్తీలలో, ఉద్యోగావకాశముల కొరకు కార్యాలయాలు తెరవాలి. ఆ కార్యాలయంలో ప్రతి వ్యక్తి యొక్క పేరు, మరియు విద్యార్హతలు నమోదుచేయాలి. లోకవిద్య యొక్క అర్హతపై ఖచ్చితమైన ఉపాధి, సంపాదన ఉండాలి. ప్రతి వీధిలోనూ అందరికి సమానమైన వేతనం ఉండాలి. అందరికి సమానమైన వేతనము అనగా, దేశములోని ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి, దేశమును అభివృద్ధి పథములో మార్చడానికి ఇంతకంటే వేరే మార్గము లేదు.



# అందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానముగా వేతనము కొరకై పోరాటం

అందరికీ న్యాయమైన మరియు ప్రభుత్వ ఉద్యోగులతో సమానముగా వేతనము రావడము కొరకై క్రింద ఇవ్వబడిన అంశములపై విశ్వాసము దృఢముగా ఉండాలి, స్వశక్తితో పోరాడాలి.

1. లోకవిద్య సంఘము అంతా ఏకమై లోకవిద్య కొరకై జ్ఞానము అను హక్కు కొరకై పోరాటం చెయ్యాలి.
2. లోక జ్ఞానము ఉన్న వారికందరికీ ప్రభుత్వ ఉద్యోగులతో సమానముగా గౌరవము మరియు విలువ ఇవ్వాలనే పోరాటం అవసరం.

అందువలన ఈ క్రింది ఇవ్వబడిన సూచనల గురించి ఆలోచించి మీ అభిప్రాయాన్ని ప్రజల మధ్య పెట్టండి.

1. లోక జ్ఞానము ఉన్నవారికి, కాలేజి విద్యతో సమానముగా ఉన్నవారితో విలువ మరియు గౌరవము, సరైన అవకాశము లభించినచో, రైతు యొక్క కుమారుడు గ్రామాన్ని వదిలి ఎందుకువెళ్తాడు? చిరువ్యాపారము చేసే కుమారుడు వారిఇల్లు, సమాజమును వదిలి ఎందుకు వెళ్తాడు? ఇంట్లో ఆడవాళ్ళు, పరాయి ఇంట్లో కూలిపనికి ఎందుకు వెళతారు? లోక జ్ఞానము యొక్క బలముపై జీవించే అధికారము వాళ్ళ జన్మహక్కు. ఇది అడ్డుకోవడము అన్నిటి కంటే హింస అవుతుంది. ఇది అమ్మఒడిలో నుండి బిడ్డను లాక్కున్నట్లు అవుతుంది.
2. కాని ఈ రోజులలో జరుగుచున్నదేమిటి? లోకవిద్యా బలంతో చాలామంది వారి జీవితమును గడుపుచున్నారు కాని స్థిరత్వంలేదు. బీదవారు, బీదరికమును అనుభవిస్తూనే ఉన్నారు. ఎవరైతే వారి లోక జ్ఞానముపై బ్రతుకుచున్నారో వారి పరిస్థితి చాలా హీనంగా ఉన్నది. వీరే నిరాశ్రయులవుతున్నారు. వీరు తయారు చేసిన వస్తువులకు తగిన రేటు లభించుటలేదు. ఉదా॥ మేదర్లు, కమ్మర్లు, కుమ్మర్లు, కంసాలులు, చాకళ్ళు, మంగళ్ళు, తోలుపరిశ్రమవారు, గీతపనివారు, చేనేతన్నలు మొ॥వారు.
3. లోక జ్ఞానము ఉన్నవారందరూ ఈ సమాజములో బ్రతకాలంటే ప్రతి అడుగులో సంఘర్షణ చేస్తూ ఉండాలి. విద్యుత్, నీరు విత్తనములు, ముడిసరుకులు పొందుటకై ప్రభుత్వ నియయాలు ఆటంకము కల్గిస్తున్నాయి. ఇవి మాత్రమే కాకుండా పౌరుల హక్కులన్నింటికి ప్రభుత్వము భంగము కల్గిస్తోంది. వీరుండే నివాసాలు మరియు పర్యావరణముపై ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారికి జ్ఞానము ఉన్నా లేకున్నా

ఒకటే. కొత్త పద్ధతులు, వికాసము, పట్టణీకరణము మరియు వీటి వ్యవస్థలన్నీ వారికున్నటువంటి జ్ఞానాన్ని వారియొక్క జీవితమునుండి వేరుచేసి కొత్త వ్యవస్థను వారికి చూపుతోంది. వైద్యశాల, గ్రామములో ఉన్న రోడ్ల యొక్క శుభ్రత, సాధారణ అవసరాలన్నింటికీ వీరు దూరముగా ఉండవలసి వస్తోంది. ఇట్టి పరిస్థితులలో కూడా వారు, వారికున్నటువంటి జ్ఞాన బలముపైననే జీవిస్తున్నారు. భేదభావములు లేకుండా అందరితో కలసిపోవుచున్నారు.

4. లోకవిద్యా సమాజములో నున్న ప్రజలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులకు బజారులో తక్కువ ధర వచ్చేటట్లు మరియు వారికి అవసరమున్న వస్తువులు ఎక్కువ ధరకు కొనేటట్లు జరుగుచున్నది. ప్రభుత్వము ఏ మాత్రము సహాయము చేయడము లేదు. దూది, లోహములు, ప్లాస్టిక్ సామానులు, వీటన్నిటినుండి సామాను తయారుచేసే వ్యాపారస్తులు, మంగలి, బెస్తవారు, సాలెవాళ్ళు, మేదర్లు, కుమ్మర్లు, కమ్మర్లు, దర్జీ మొదలగువారు, మోటారు మెకానిక్‌లు, ఇళ్ళుకట్టే మేస్త్రీలు, రైలుపట్టాలపై పనిచేసే కూలీలు రకరకాల పనులు చేసే కూలీ వాళ్ళు మరియు స్త్రీలకు న్యాయము జరగడంలేదు. వీరందరు కూడా స్వశక్తి మరియు జ్ఞానం ఉన్నవాళ్ళే. ఇలాంటి సమాజము (స్వాతంత్ర్యదేశంలో 80%) మంది ప్రస్తుత బజారులో మోసపోతున్నారు, మోసపోతూనే ఉన్నారు. వీరి ఉత్పత్తులు పర్యావరణకు తోడ్పడతాయనే జ్ఞానం చదువుకున్న వారికి లేదా?

5. దేశములో ఉన్న నాయకులు, బాగా చదువుకున్నవారు అందరినీ కాలేజి విద్య చదవమని సలహాలిస్తారు. చదువుకొని, ఉద్యోగాలు పొందండి, మిమ్మలి గౌరవిస్తారు అని అంటారు. కాని స్వాతంత్ర్యము వచ్చిన 65 సం॥ల తరువాత కూడా, అందరికి నిర్భంధ విద్య అని ఆశచూపుతున్నారు. వీరి చదువులు ప్రస్తుత ఉద్యోగాలకు చాలదని వేలెత్తిచూపుచున్నారు. వీరందరు కూడా ప్రగతి పథంలో నడచి, లోకవిద్యా జ్ఞానము ఉన్నవాళ్ళు విద్యార్జన చేసిన వాళ్లకంటే ఏ మాత్రం తక్కువ కాదు. అందరితో సమానంగా మాకు హక్కులుండాలి అని వీరు పోరాడాలి.

6. అన్నిటికంటే దౌర్భాగ్యం ఏమిటంటే, ఈ దేశంలో నాయకులు, పరిపాలకులు, విద్యార్జన చేసినవాళ్ళు లోకవిద్యా సమాజములో "జ్ఞానము" లేదు అని అభిప్రాయపడతారు. రైతులు, వ్యాపారస్తులు మరియు ఆదివాసులు, సామాన్య స్త్రీలను కష్టపడి పనిచేసేవారు అని మాత్రమే అంటారు. మరియు వీరందరికి తగిన నేర్పు ఉంది. అందువలన కష్టపడి పనిచేసి బ్రతకగలుగుతారు. చదువుకొన్నవారు, వీరందరూ చేయు పనులలో ఒక సిద్ధాంతము, తర్కము మరియు విలువ ఉన్నదని భావించరు. వీరంతా వారియొక్క కార్యజ్ఞానము వలననే కార్యములు చేయగల్గుచున్నారు. జ్ఞానము కేవలము చదువుకున్న వారికి మాత్రమే ఉన్నది అని వారు భావిస్తారు. వీరందరూ కూడ వారికున్న జ్ఞానమునకు



వారు పోరాడాల్సిందే లేనిచో రైతులు, వ్యాపారస్తులు, ఆదివాసులు, స్త్రీలు వారియొక్క హక్కులను కోల్పోతారు.

7. లోకవిద్యా సమాజము ముందున్న మార్గమేది? లోకవిద్యా సమాజము వారు వారియొక్క బలహీన పరిస్థితిని ఆపుటకు వారియొక్క జ్ఞానంకున్న విలువకొరకై పోరాడాలి. ఈ విధముగా మొట్టమొదటి షరతు ఏమనగా లోకవిద్యా ప్రజలు వారు స్వయంగా మాకు జ్ఞానమున్నదని గుర్తించి, వారిజ్ఞానానికి ప్రభుత్వోద్యోగులతో సమానముగా వేతనము, హక్కుల గురించి పోరాడాలి. ఇది కేవలము ఈ సమాజమునకు మాత్రమే కాకుండా ఈ దేశము యొక్క స్వాభిమానము, సమృద్ధి మరియు గౌరవము పెంపొందించటానికి దోహదపడతుందని గుర్తించాలి.

## ఇది ఏ విధముగా జరుగుతుంది?

అందరి క్షేమము, సంపాదన గురించి ఆలోచించే సామాజిక కార్యకర్తలు, ఇతరుల నుండి ఎన్నో ప్రశ్నలు అడగబడతాయి. సుమారు మూడు సంవత్సరముల నుండి లోకవిద్యా ఆందోళన నడుస్తూనే ఉంది. మనకి 2 రకాల మనుష్యులు కలుస్తారు. ఒక రకము మనుష్యులు, లోకవిద్యాజనుల యొక్క మాటలు అసలు పట్టించుకోరు, ప్రతి మాట వాళ్ళకు వ్యతిరేకముగా మాట్లాడతారు మరియు హేళన చేస్తారు. రెండవ రకము మనుష్యులు, అందరికి సమానమైన సంపాదన ఉండాలి అని భావిస్తారు. వారికి ఆసరా ఇస్తారు. కాని వాళ్ళ మనసులో ఒక ప్రశ్న, రెండు రకాలుగా ఉంటుంది.

ఒకటి ప్రతి దినము రోజు కూలి 300 రూ॥లు సంపాదించే వారికి ప్రభుత్వము 1000/- రూపాయిలు ఎందుకిస్తుంది?

రెండవది వీరి గురించి డబ్బులు ఎక్కువగా ఖర్చవుతాయి? అవి ప్రభుత్వము ఎక్కడి నుండి తీసుకొస్తుంది? వీటికి కావలసిన సమాధానాలు మనమే చెప్పాలి.

1. మనము ఈ విధముగా అనడానికి లేదు, కొన్ని ప్రభుత్వములు మొదటి నుండి కూడా ఈ సమస్యను పట్టించుకోలేదు. ప్రభుత్వము యొక్క కొన్ని విభాగములను; పరిపాలనా విభాగము, విద్య, ఆరోగ్య, పారిశ్రామిక విభాగాలల్లో 6వ వేతన సంఘం 10 సం॥ సర్వీసులకే పూర్తి పెన్షన్ సదుపాయం కల్పించినా 60 సంవత్సరాల దాకా ప్రభుత్వోద్యోగులుగా పనిచెయ్యటానికి కారణం, వీరు బయట ప్రపంచంలో మనదేశంలో ఆ ప్రభుత్వ వేతనాన్ని సంపాదించే అవకాశం లేకపోవటమే! విద్యుత్ మేస్త్రి, వడ్రంగి, కంప్యూటరు టెక్నీషియన్లు మొదలగువారికి ప్రభుత్వము ఇచ్చు వేతనము ఒక్క రోజుకు 1000/- రూ.ల కంటే ఎక్కువ. ఈ పనివారు బయట చేస్తే కేవలము 300/- రూ॥లు మాత్రమే సంపాదిస్తారు. సుమారు అన్నిరకముల పనిచేసేవారికి ఈ విషయం సమానముగా వర్తిస్తుంది. కాని బయటి కూలీల వేతనము, ప్రభుత్వ వేతనంతో

సమానముగా ఇవ్వాలని ఆలోచించరేమిటి? 250 సం॥ల నుండి ఈ దేశములలో వచ్చు ప్రభుత్వములన్నియు ఈ భేదాన్ని పాటిస్తున్నాయి. కానీ మనమేమంటున్నామంటే, ప్రభుత్వము ఈ దేశంలో ఉన్న పౌరులందరిని సమాన దృష్టితో చూడాలి. న్యాయము చేయాలి అన్యాయము చెయ్యకూడదు. కష్టపడేవారికి వారి కష్టానికి తగిన వేతనము ఇవ్వాలని అనుకోవాలి. ప్రభుత్వము దృష్టిలో కేవలము ప్రభుత్వ ఉద్యోగులే మనుష్యులా, మిగతావారు చాలా తక్కువగా చూచే ఆలోచన అంతమొందాలి.

2. మనమంతా సహృదయులం. మన కోర్కెలకు వ్యతిరేకత రావడము మనము కోరుకోలేదు. అందుకే మన జీవితము గడపడానికి ప్రభుత్వముపై ఎంత భారము పడుతుందో ఆలోచిస్తాము. అదే ప్రభుత్వము గురించి ఈ విధముగా ఆలోచిస్తాము, పెట్టుబడుదారులకు, వ్యాపారులకు, ఇతర వ్యాపారస్తులకు ఆధారము చూపిస్తారు, డబ్బులు ఇస్తారు, వ్యవస్థ చూపిస్తారు, సంస్థానములు, సౌకర్యములు, అవకాశములు మరియు సురక్షిత మార్గము చూపిస్తారు. ఆ సౌకర్యాలన్నీ వాళ్ళకు కల్గిస్తుంటే మనము మీకంత డబ్బు ఎక్కడి నుండి వస్తోందని మనం అడగడము లేదు. ఇది మనకు మేలు జేయడానికి కాదు. ఇది మనము అర్థము చేసికోవడము లేదు. అర్థము చేసుకోకపోవడమంటే ఏమిటి? ఈ ఆధునిక సమాజము యొక్క వ్యవస్థ ఏవిధముగా నడిచేది అర్థము చేసుకోలేము. ల్యాపుటాపులు, నిరుద్యోగభృతి, పాఠశాలకు వెళ్ళే బాలికలకు సైకిళ్ళు, వివాహము గురించి మహిళలకు సహాయము, రెండు రూపాయలకు కిలో బియ్యము, గులాబికార్డు, తెల్లకార్డు దారులందరికి తక్కువధరలో ధాన్యము అందజేయుట, ప్రతి ఇంట్లో మూత్రశాలలు, ఆరోగ్యకార్డు, మధ్యాహ్నభోజన పథకము, సర్వశిక్ష అభియాను మొదలగు వసతులన్నియు ప్రభుత్వము కల్పిస్తోంది. కాని ప్రభుత్వము, ఒక విషయము గురించి శ్రద్ధ తీసుకోవడం లేదు, అది ప్రతి కుటుంబములో ఒకరికి తప్పకుండా ఉద్యోగము ఇవ్వాలి. ఈ విధముగా ఉద్యోగాలిస్తే ఏవిధమైన ప్రభుత్వ సహాయం అవసరము లేదు. సమస్య డబ్బుల గురించి కాదు? సమస్య న్యాయం గురించి, రాజనీతి గురించి, సమాన దృష్టి గురించి. దీన్ని ప్రస్తుత పాలకులు కోరుకోవడములేదు. ప్రతి ఇల్లు సౌభాగ్యముగా ఉండే, అభ్యున్నతి పథంపై నడపడానికి మనం ఆలోచించలేదు. ఈ విధమైన మాట మన ముందుకొస్తే మనం ప్రపంచం మొత్తంలో కారణాలు వెతికే వాళ్ళం. డబ్బుల మహాత్యము గురించి, సరియైన ప్రణాళిక చేస్తే ప్రతి కుటుంబానికి ఖచ్చితంగా ఉద్యోగము మరియు వేతనము తప్పకుండా వస్తుంది.

3. అన్నిటికంటే మహత్తరమైన మాట ఏమంటే లోకవిద్యా సమాజానికి ఈ కోరిక యొక్క పునాది మరియు శక్తిని వారు గుర్తించాలి. మరియు వారికున్నటువంటి విద్య మరియు జ్ఞానములో దృఢమైన విశ్వాసాన్ని పెంచుకోవాలి. వారికున్న జ్ఞానాన్ని స్వయంగా సమాజములో సరియైన గౌరవాన్ని మరియు విలువలను పెంపొందించేటట్లు చేయాలి.



# అందరి జ్ఞానానికి సమానమైన, కచ్చితమైన సంపాదన ఉండాలి

ఈ న్యాయమైన కోర్కె యొక్క లక్ష్యము, మనం సమ సమాజము తయారుచేయడానికి, ప్రగతి పథములోనికి రావడానికీ, సమాజంలో అందరూ జ్ఞానులు, అందరూ సౌభాగ్యవంతులుగా, సమాజములో అందరికి సమానమైన గౌరవ మర్యాదలు ఉండాలని కోరుకొనటమే మన లక్ష్యం.

ఈ లక్ష్యాన్ని పొందటానికి ఈ క్రింద ఇవ్వబడిన సూచనలు ఉన్నత స్థానంలో ఉండాలి.

1. సమాజములో అందరి యొక్క సౌభాగ్యము గురించి ఆలోచించి కార్యరూపంలో పెట్టాలి.
2. రెండు రకములైన అభిప్రాయాలు ప్రకటించకూడదు.
3. జ్ఞానానికి సంబంధించిన అన్ని సమూహములు, జాతులవారికి సమానమైన హోదా ఇవ్వాలి.
4. సమాజములో ఉన్నటువంటి బీదరికం, అసమానత్వం నశించాలి.
5. జన్మభూమితోపాటు, సరియైన జీవితాన్ని గడపుటకు, విద్యాభ్యాసం చేసినచో ప్రతిష్ఠ లభిస్తుంది.

సమాజము వారి విద్య కొరకై న్యాయమైన వాటా కోసం ఏవిధముగా పోరాడుతుంది?

లోకవిద్యా సమాజము వాళ్ళు వారి న్యాయమైన వాటా కోసం పోరాడటానికి, ఇది అర్థం చేసుకోవాలి. ఏమంటే వీరికున్న జ్ఞానం ఏపనిలో వారికి పనికొస్తుందో దాని శక్తి పైనే వారికి పని దొరకాలి మరియు ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానముగా గౌరవము విలువ, సౌకర్యములు లభించాలి. ఇక్కడ మనలోకవిద్యా సమాజములో కొన్ని పెద్ద పెద్ద సమూహాల ఉదాహరణలతో, చూపిస్తూ ఎలాంటి హక్కుకై పోరాడవలెనంటే, ఈ సమస్య రూపుమాపటానికి, నవయువకుల గురించి మాట్లాడాలి వారు సమాజంలో అనేక పనులు చేస్తున్నారు.

## 1. రైతులు వారి జ్ఞానం యొక్క హక్కుకై పోరాడాలి

1. రైతు యొక్క జ్ఞానము వ్యవసాయ ప్రొఫెసర్లు మరియు వ్యవసాయ వైజ్ఞానికుల జ్ఞానము కంటే తక్కువ కాదు. ఒకవేళ వ్యవసాయ ప్రొఫెసరుకు 50,000/- వేల రూపాయల నుండి ఒక లక్షవరకు ప్రతినెల వేతనము ఉంటుందో, అదే మాదిరిగా రైతుకు లోకవిద్యా బలముపైన ఖచ్చితమైన సుమారు అంతే సంపాదన లభించాలి.

2. ఒక వ్యవసాయ ప్రొఫెసర్నీ, వైజ్ఞానికుణ్ణి, రైతునీ పొలములో పంట పండించమని చెప్పండి. రైతుముందు మిగతా ఇద్దరూ ఓడిపోతారు. ఐతే, వ్యవసాయ ప్రొఫెసర్లనీ, వైజ్ఞానికులనీ అజ్ఞానులని అంటామా? కాదు. ఏ రైతు అయితే వ్యవసాయము చేస్తాడో, అతనికి చదవడం, వ్రాయడంరాదో, అతన్ని అజ్ఞానుడని అంటామా? అతడు ప్రొఫెసరుకంటే తక్కువ వేతనము పొందుతున్నాడు. ఇది ఒప్పుకోవడమెలా? ప్రభుత్వ ఉద్యోగులకు, విద్యార్హత ఉన్నవాళ్ళకు లక్షలు, వేలరూపాయలు నెలకు వేతనము ఉంటుంది. ఎవరైతే పంటలు కష్టపడి పండిస్తారో ఆ రైతులకు సంవత్సరమంతా కూడా ఆ వేలు, లక్షలురావు.

3. రైతుకు అతని యొక్క జ్ఞానము సంపాదించుటకొరకై సంవత్సరములకొలది కష్టపడవలసి వస్తుంది. ప్రకృతి వలన, భూమి యొక్క సారము, తేమ, జీవ జంతువులు, ఋతువులు మారడం, విత్తనముల రకాలు, పంటలు పండించుటకు కావలసిన పద్ధతులు, నీటి అవసరము మొదలగు విషయములన్నియు అతనికి పనిద్వారానే నేర్చుకుంటాడు. ఇన్ని విషయములు నేర్చుకోవడానికి ఎన్ని సంవత్సరములు పడుతుందంటే అన్ని సంవత్సరములు కాలేజీలో చదువుకోవడానికి పట్టేకాలం. ప్రతి రైతు యొక్క ఇల్లు, పొలము విద్యాలయమే అవుతుంది. కాని దేశనాయకులు, చదువుకున్న వారు మాత్రం వీరిని కూలీల మాదిరిగానే చూస్తారు. వీరి జ్ఞానాన్ని గూర్చి తెలుసుకోరు. రైతుకు అతడు చేసే ప్రతి పనీ జ్ఞానంతోనే పోరాడాలి, వారి ఇల్లు, పొలాన్ని విశ్వవిద్యాలయముతో సమానముగా చూడమని కోరాలి.

4. రైతులు విత్తనములు, ఋతుమార్పు మరియు ప్రభుత్వ పద్ధతులను అనుసరించి, కొత్తకొత్త పరిశోధనలు జరుపుతూ వ్యవసాయము చేయవలసి ఉంటుంది. ఇవన్నియు అతని భుజస్కంధాలపై వేసుకుంటాడు. నష్టాన్ని అతడే భరించుకోవాలి. కొన్ని ప్రయోగాల ద్వారా వారి జ్ఞానము కొత్త విషయాలను తెలుసుకుంటుంది. అయినా వారియొక్క జ్ఞానాన్ని పురాతనమైనదని, పనికిరాదని అంటారు. రైతుకు వారియొక్క జ్ఞానంపై జీవించేటట్లు అన్నిటికంటే నూతన, సమకాలీన మగునట్లు పోరాడాలి.

5. రైతు యొక్క జ్ఞానము ప్రకృతితో ముడిపడి ఉంటుంది. రైతు యొక్క విద్య భూమి, ప్రకృతిని తల్లి హోదాలో చూస్తాడు. తల్లి సేవ వలననే జీవితం వృద్ధి అవుతుంది. రైతు తన ప్రతి పని చేయుటకు ముందు ఆ పనిని వేగముగా చేయుటకు, దానివలన కలుగు పరిణామాల గురించి బాగా ఆలోచిస్తాడు. ఆలోచించిన తరువాతనే ఆమార్గాన్ని అనుసరిస్తాడు. వాటివలన ప్రకృతి మార్పుల వలన పంట నష్టపోకుండా ఆలోచిస్తాడు. లోకవిద్యననుసరించి, విశ్వవిద్యాలయ విద్యలో ప్రకృతి, మానవ సమాజం రెండింటిపైన అవగాహన చేసుకోవలసిన అవసరముంది. ఈ నియంత్రణ హింసను ప్రేరేపిస్తుంది. విశ్వవిద్యాలయములో చదువుకున్నవారికంటే, లోకవిద్యా జ్ఞానము ఉన్నవారు ప్రకృతి యొక్క నాశనాన్ని అడ్డుకోవడానికి సమర్థంగా పోరాడతారు. ఏక పంట విధానంలో ఎక్కువ నీరు, ఎరువులు, పురుగుమందులు ప్రవేశపెట్టింది శాస్త్రజ్ఞులే. బహుళ పంటలు, అంతర్‌పంటలు, కంపోస్ట ఎరువుల నుండి రైతులను దారిమరల్చి పర్యావరణ విధ్వంసాన్ని సృష్టించింది. శాస్త్రజ్ఞులే.

6. రైతు యొక్క విద్య సమాజానికి సంబంధించి ఉంటుంది. ఇతడు సమాజములోనే జన్మిస్తాడు, మనుగడ సాగిస్తాడు. కనుక సమాజంలో ఉన్న ప్రతి వ్యక్తిని గుర్తించి, అతని సహాయము పొందుతాడు. తద్వారా అతడు కొన్ని హక్కులు కల్గి ఉంటాడు. వారి బలముతో అతను జీవితాన్ని నడిపిస్తాడు. ఇది ప్రజల యొక్క చదువు. రైతు ఏ సంస్థ మరియు రాజ్యానికి బానిస కాడు. అతడు ప్రజల దగ్గర ఉంటాడు, ఐకమత్యముతో ఉంటాడు. ఇతన్ని మనుష్యులచే వేరు చేయలేము. అందువలన లోకవిద్యా బలముపైనా జీవితాన్ని గడుపుట మనుష్యులకున్న జన్మసిద్ధ అధికారము, దీన్ని ఎవరూ తీసుకోలేరు. ప్రపంచీకరకణ, వీధులు, పట్టణీకరణ, జీవిత పద్ధతులు మొదలగునవి రైతుకు వ్యతిరేకమైనవన్నీ ఎదుర్కోవడమేకాదు, జీవితము యొక్క మౌలిక సత్యాన్ని అనే జ్యోతిని వెలిగించుటకు మనుష్యులకు ఉన్న ఈ అధికారాల కోసం పోరాటం సాగించాలి. లోకవిద్యను విశ్వవిద్యాలయ విద్యతో సమానంగా గౌరవించాలి.

7. 1970-80 సం॥ నుండి ఈ దేశంలో పెద్ద రైతుల ఆందోళన నడిచింది. లోకవిద్య జ్ఞాన ప్రతిష్ట యొక్క పునాదివేశారు. ఈ ఆందోళన యొక్క ముఖ్యమైన డిమాండ్ ఏమనగా, పంటకు తగినవెల, విద్యుత్తు, అప్పులు, ఆ ఆందోళన యొక్క ముఖ్య ఉద్దేశ్యము ఏమనగా, వారియొక్క జ్ఞానం, కష్టమునకు తగిన విలువను బహిరంగంగా అడగడం, సందేహములను తీర్చుకోవడం. వీటివలననే లోకవిద్యా జ్ఞానం కొరకై పోరాడటానికి మార్గం లభించింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఆదాయం, రాష్ట్రములోని అన్నిటిపైన సమానమైన హక్కులు, విద్యుత్తు, నీరు, విత్తనములు, శిక్షణ మరియు ఆరోగ్యానికి సంబంధించిన అన్ని కోర్కెలు కోరడమైనది. ఈ రూపంలో లోకవిద్య జనాందోళన, లోకవిద్యా సమాజానికి ముందు మార్గంలో నడుస్తుంది.

8. మనదేశములో వ్యవసాయం చేయువారు, వ్యవసాయంపై ఆధారపడి జీవించే వారి సంఖ్య ఎక్కువగా నున్నది. మంచి అధునాతనమైన వ్యవసాయం చేసే జ్ఞానం ఉన్నవారు వున్నారు. కొంతమంది ధాన్యములను పండిస్తారు కొంతమంది కూరగాయలు, కొంతమంది పండ్లు, పూలు పండిస్తారు. ఇందులో ఎన్నో జాతులవారు, ఎన్నో ధర్మములకు

సంబంధించిన వారు, ఆదిమ వాసులు, గిరిజనులు, వ్యాపారస్తులు వీరందరికి వ్యవసాయ జ్ఞానం కలదు. వీరందరూ కూడ ఐక్యమత్యముతో కలసి పోరాడితే బీద, గొప్ప తారతమ్యము. దూరము కాగలదు. అందువలన లోకవిద్యా బలముపైన ఆధారపడి ఖచ్చితమైన వేతనము, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనము ఇవ్వవలయునని, రైతు కుటుంబాలను ఆదుకోవలయునని కోరుకోవడం ధర్మ బద్ధమైనది.

9. ఇవి గ్రామ ప్రజలయొక్క ఆత్మ విశ్వాసానికి మార్గము. ఈ ఆత్మ విశ్వాసాన్నే మొత్తం ప్రపంచంలో ఉన్నటువంటి కొత్తకొత్త పద్ధతులు తెలుసుకోవడానికి మార్గం సుగమం చేస్తుంది. గ్రామములో ఈ రోజు గుర్తించాల్సిన ప్రధాన సమస్య బీదరికం. ఈ రోజుల్లో అందరి మార్గము డబ్బు సంపాదించటం పైననే. ప్రతి కుటుంబములో ఒక ఉద్యోగము ఇచ్చినచో, అద్భుతమైన మార్గములో గ్రామాలను సంపన్నంగా చేయగల్గుతారు. దీనివలన నేరస్తులుగా భ్రష్టులుకాగలటానికి అవకాశము ఉండదు. నిజంగా రకరకాల సామాజిక విభాగముల యొక్క స్వయం శక్తి, ఆత్మ విశ్వాసానికి మార్గం ఏర్పడుతుంది.

## 2. వివిధ వృత్తులవారు వారి జ్ఞానం యొక్క హక్కుకై పోరాడాలి

1. విశ్వ విద్యాలయం లేక కాలేజిలో చదివినటువంటి ఇంజనీర్లు మరియు శాస్త్రవేత్తల యొక్క జ్ఞానముకంటే, లోకవిద్యాజ్ఞానం ఏ మాత్రము తక్కువలేదు. వారియొక్క జ్ఞానంతోనే, అవసరాల యొక్క బలముపైన రకరకముల వృత్తులవారు, కమ్మరి, వడ్రంగి పనివారు, రాతిపనివారు, ప్లాస్టిక్, దూది, కాగితము, ధాతువులచే వారి జీవనమునకు అవసరమగు వస్తువులను తయారు చేస్తారు. నవీన యంత్రములు, మోటార్లు, కంప్యూటర్లు, మొబైల్‌ఫోన్లు, కొత్త పద్ధతులు (విద్యుత్తు, నీరు, భవనములు, ఇంటర్‌నెట్) తయారు చేయుటకు, శ్రమ పడతారు. పనిచేసేవారికి కూడా లోకవిద్యా బలము పైన ఖచ్చితమైన వేతనము లభించాలి. అది ఇంజినీర్లు, శాస్త్రవేత్తలతో సమానంగా ఉండి తీరాలి.

2. మీరు ఏ చిన్న గ్రామమైనా, పెద్ద గ్రామాలకు, పెద్ద పట్టణాలలో ఉన్న బస్తీలకు, వెళ్ళినచో, మీకు రకరకాలైన వస్తువులు తయారు చేసేవాళ్ళు, విభిన్న వస్తువులు తయారుచేసేవారు, రకరకాల సేవ చేసేవారు, చేతిపనుల వారి సమాజములు కనిపిస్తాయి. వీరందరు కూడా తమతమ పనులలో నిపుణులు, దేశములోని జనసంఖ్యలో పెద్ద భాగము కూడ వీరే. రైతు సమాజమువలె వారి యొక్క జ్ఞానాన్ని సమాజంలో అనేక సంవత్సరముల నుండి శిక్షణవలన పొందగల్గుతారు. బట్టలునేసే లేక ఎలక్ట్రిక్ పనిచేసే మేస్త్రి వీరందరికీ తగిన జ్ఞానం ఉంది. వీరికి అందుబాటులో వారి నైపుణ్యంవలన చేసే వస్తువులకు తగిన ఇండ్లు, విద్యాలయములు, ప్రయోగశాలలు ఉన్నాయి. కొత్తకొత్త మార్గములను ఎదుర్కొంటూ వారికున్న జ్ఞానాన్ని అభివృద్ధి



చేసుకొంటారు. చాలాసార్లు, పెద్దపెద్ద ఉద్యోగస్తులు, విశ్వవిద్యాలయ ఉద్యోగస్తులు వీళ్ళ సలహాలు తీసుకోవడానికి వస్తారు. కాని వారికి తగిన హోదా ఇవ్వలేరు. ఇటువంటి సమయంలో చేతిపనులవారు వారికున్న జ్ఞానాన్ని గుర్తింపుకై పోరాడాలి.

3. నీటిమార్పులు, పర్యావరణ సంకటములు, నీటి సమస్యలు, అడవులను నరికివేయుట ఇవన్నియు 200 సం॥ల నుండే జరుగుతున్నాయి. ప్రకృతిని నాశనంచేస్తున్నవారంతా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నవారే. ఈ సమస్యలన్నింటిని రూపుమాపాలంటే అందులో చేతిపని వారి యొక్క పాత్ర మొట్టమొదటి స్థానము. చేతిపని వారికి వారియొక్క జ్ఞానానికి తగిన మూల్యము లభించినచో, జీవితము సఫలము కాగలదు. శాస్త్రజ్ఞులు, ఇంజనీర్లు, ముందు వారు సమానస్థాయిలో నిలబడగలరు, అప్పుడు తమ జ్ఞానాన్ని, విలువలని సమాజములో ప్రవేశపెట్టగలగినప్పుడు, అప్పుడే సమాజంలో సమానమైన, కొత్త పరిస్థితిని దేశం ముందు పెట్టగల్గుతారు. ఇందులో కొందరు శాస్త్రవేత్తలు, హోమీబాబా, సి.ఎన్.ఆర్. రావు, అబ్దుల్‌కలామ్‌ల కంటే మేలైన శాస్త్రవేత్తలే వస్తారు.

4. చేతిపనుల వారి సమాజంలో ఎన్నో జాతులు, ఎన్నో ధర్మాలకు సంబంధించినవారు, ఆదివాసులు, గిరిజనులు కలరు. అందరిని వారి జ్ఞానంపై ఉన్న విశ్వాసాన్ని దృఢంగా ఉంచి, వారి జ్ఞానాన్ని విశ్వవిద్యాలయములో ఉన్నవారి జ్ఞానంతో సమానంగా చూడాలి. న్యాయమైన కోర్కెలపై ఒత్తిడి తేవాలి.

5. పర్యావరణ రక్షణకోసం తాటాకు, ఈతాకు, వెదుళ్ళతో చేసే బుట్టలు, నూలు సంచులు వాడటంద్వారా ప్లాస్టిక్‌ను అరికట్టి పట్టణప్రాంత శుభ్రత, పర్యావరణ కోసం ఖర్చులు తగ్గించవచ్చని తెలిస్తే మేదర్ల, దర్జీల విలువ అందరికి తెలుస్తుంది. కర్బన ఉద్గారాల్ని తగ్గించాలంటే మార్గం కనపడుతుంది.

## 3. ఆదివాసీలు వారి జ్ఞానం యొక్క హక్కుకై పోరాడాలి

1. ఆదివాసుల యొక్క సౌభాగ్యము, సక్రియత, సమతుల్యత, అధికారము యొక్క నియంత్రణలను ముందుకు నడిపే వ్యవస్థ, ఆదివాసుల యొక్క సామర్థ్యంపైననే ఆధారపడి ఉన్నది.

2. కొన్ని గిరిజన ప్రాంతాల్లో, నీరు, అడవి, జీవితం మరియు భూమికి సంబంధించిన జ్ఞానం ఆదివాసులలో మాత్రమే ఉంది. ఆదివాసుల యొక్క ఆ జ్ఞానం, చదువున్న వారికంటే ఏమీ తక్కువకాదు. వీరు సమాజం, ప్రకృతికి ఎక్కువ అనుకూలంగా, ఉంటారు. వారి ఉత్పత్తుల ద్వారా పర్యావరణాన్ని నాశనం చేయకుండా తరతరాలుగా అడవుల్ని వీరు మాత్రమే కాపాడారు. సామాజిక అవసరాల్ని తీరుస్తూ పర్యావరణాన్ని రక్షిస్తారు.

3. ఉద్యోగాల్లో ఒక చిన్న భాగం ఆదివాసులకు అవకాశం వచ్చింది కాని సుమారు వీరంతా పొలంపని, చేతిపనుల ఆధారముపైననే వారియొక్క జీవితాన్ని గడుపుచున్నారు. ఈవిధంగా వారు రైతులు, చేతిపని నిపుణులు సమాజం యొక్క సోదరులని అందరికీ తెలుసు, వీరియొక్క జ్ఞానాన్ని ధరణీమాత యొక్క సాన్నిధ్యములోనే వస్తుంది. వీరియొక్క జ్ఞానం మిగతా ప్రతిష్టాత్మకమైన జ్ఞానంతో సమానంగా విలువ, గౌరవం ప్రపంచం యొక్క పునర్ నిర్వచనం అవసరం. వీరి జీవనం అహింసాత్మక మార్గంలలో నడుస్తుంది. వారు సమానహక్కులకై పోరాడాలి. ఆదివాసి సమాజం వారికి లోకవిద్యాబలముపైనా ఖచ్చితమైన సంపాదన, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు ఉండాలి, వీటికొరకై న్యాయబద్ధమైన కోర్కెలపై ఒత్తిడి తేవాలి.

4. మనదేశంలో ఆంగ్లేయులతోఆదివాసులు పోరాటాలు చేశారు. వారియొక్క విద్యాబలముతోనే అన్యాయము నుండి విముక్తి పొందారు. ప్రపంచములో చాలా దేశములలో ఆదివాసులు సమాజంలో వారి విద్య యొక్క శక్తి ద్వారానే గుర్తింపు పొందారు. ప్రకృతిని నాశనం చేసేవారు “వికాసవిద్య” పైన ప్రశ్న వేస్తున్నారు. ఈ ప్రక్రియను దృఢంగా చేయవలసిన అవసరం ఉంది.

## 4. చిన్నదుకాణాదారులు వారి జ్ఞాన యొక్క విలువకై పోరాటం

1. రైల్వే గేటు దగ్గర పనిచేసేవారు, తిరుగుబండివారు, ప్లాటుఫారంపై వస్తువులు పెట్టుకొని అమ్మేవారు, తక్కువ పెట్టుబడితో తక్కువ శ్రమ, తక్కువ చోటులో వ్యాపారం మెలకువలు తెలిసిన వీరు ఉన్నతమైన జ్ఞానం కల్గి ఉంటారు.

2. చిల్లర వస్తువులు తయారుచేసిన వారినుంచి సేకరించి స్థానిక వస్తువుల్ని అందరికి అందుబాటులో ఉండేటట్లు చేస్తారు వీరు.

3. ఒకవేళ ప్రభుత్వము వీరిని బెదిరించడం, బీదరికంలో పెట్టకుంటే ఈ ప్రజలు వారికున్న జ్ఞానంతో, బలంతో ప్రపంచంలోని పెద్దపెద్ద కంపెనీలు, ఎక్కువ వేతనము పొందేవారిని దెబ్బతీయ గల్గుతారు. ప్రభుత్వం ఉన్నతస్థాయి వాళ్ళ పక్షాన, అన్యాయమైన నీతిని ప్రదర్శిస్తున్నారు. వారియొక్క అధికారం చిల్లర వ్యాపారస్తులపై చూపి వాటిని బహుళజాతికంపెనీ వస్తువులతో ఆక్రమిస్తున్నారు.

4. ఈ రోజు అంగడి 2 రకాలు. ఒకటి కొందరిని ముంచుతుంది, మరియొకటి సాధారణ ప్రజలకు అనుకూలంగా ఉంటుంది.

   రెండవ బజారు ఎట్లుందనగా, అందులో లోకవిద్యా సమాజమువాళ్ళే కొనటానికి, అమ్మటానికి ఉంటారు. దీన్నే మనము లోకవిద్యా – అంగడి లేదా సంత అని అంటాం. దీనిలో ఉత్పత్తిదారుల, వినియోగదారుల మధ్య దళారీలు ఉండరు. ఉన్నా అతి స్వల్పం.



5. పటిష్టమైన ప్రణాళిక అందుబాటులో రావడంలో లోకవిద్యా బజారుకు ముఖ్యమైన స్థానం కలదు. ఎందువలన అనగా ఈ బజారు యొక్క జ్ఞానం వేరుగా ఉంటుంది. వీరియొక్క బలములో ఆ సమాజం యొక్క జీవనం ఆధారపడి ఉన్నది. అందులో రైతులు, చేతిపనులవారి పరిస్థితి అందరితో సమానముగా ఉంటుంది. వీరియొక్క బలము, సంరక్షణ, హోదా వాటిపై ఆధారపడి ఉంటుంది. దీనిలో అందరి కార్యకర్తల యొక్క ఖచ్చితమైన నెలవేతనము, ప్రభుత్వోద్యోగుల వేతనముతో సమానముగా ఉండాలి.

6. చిన్న చిన్న దుకాణదారులు ప్రతి జాతి, ప్రతిధర్మమునకు చెందిన వారు ఉంటారు. ఇందులో ఒక భాగము కొందరు రైతులు, చేతిపనులవారికి ఉంటుంది. వారియొక్క సాగుబడి మరియు చేతిపనులు లాభము ఉండకపోవటం వలన చాలామంది మహానగరాలలో రైల్వే పట్టాలపై వారి జీవితాన్ని గడుపుచున్నారు.

## 5. మహిళలు వారి జ్ఞానం యొక్క విలువకై పోరాటం

1. లోకవిద్యా సమాజంలో ఉన్న అన్ని వర్గాల్లో స్త్రీలు అద్వితీయమైన మహిళలు.

2. కుటుంబ బాధ్యతలతో పాటు తినే పదార్థములు, బట్టలను తయారుచేయుట మొదలగు అన్నిటికి సంబంధించిన జ్ఞానం, నేర్పరితనము అందరి స్త్రీలలో ఉంటుంది. తినే పదార్థములు, వస్త్రముల తయారీ క్షేత్రములో స్త్రీలకు తగినట్లుగా ఉంటుంది. మరియు ఈ వస్తువుల తయారీలో స్త్రీలకు కచ్ఛితమైన వేతనము, ప్రభుత్వ ఉద్యోగస్తులతో సమానముగా లభించాలి.

3. విద్యార్థుల మధ్యాహ్నభోజన పథకం, హాస్టళ్ళు నడపడం వంటివి స్త్రీల ఆధ్వర్యంలో జరిగితే పౌష్టికాహారం పిల్లలకు లభిస్తుంది.

## 6. లోకవిద్య సమాజంలోని వివిధ వర్గాల ప్రజల జ్ఞానంయొక్క విలువకై పోరాటం

పైన వివరించిన ప్రకారం సమాజములో రకరకాల కళాకారులు, వారిలో గొప్ప తెలివిగలవారు ఉంటారు. వీరికి కూడా ప్రభుత్వోద్యోగులతో సమాన వేతనం ఇవ్వాలని కోరటం మన న్యాయమైన హక్కని గుర్తెరగాలి.

**– సునీల్‌సహస్రబుద్ధే, లోకవిద్యజనాందోళన, వారణాసి**

**అనువాదం: యం. సత్యమ్మ, విశ్రాంత ఉపాధ్యాయురాలు**